# తీరని ముచ్చట



## భట్టిప్రోలు విజయలక్ష్మి

చిన్నప్పటి నుంచి పుట్టినరోజు పండగలంటే అన్ని పండుగలకన్నా నాకు ఎంతో ఇష్టం. పుట్టినరోజు పండగ నన్ను ఆకర్షించినట్లు చివరకి పిల్లలు ఉత్సాహంగా బొమ్మలుపెట్టే సంక్రాంతి కానీ, టపాకాయలు కాల్చే దీపావళి కానీ నన్ను ఎనాడూ ఆకర్షించలేకపోయాయి. మా చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళందరూ వాళ్ళ ఇంట్లో ఏ ఒక్కరి పుట్టినరోజయినా పేరంటం చేసి పుట్టినరోజు పాపాయిని ప్రత్యేకంగా కుర్చీలో కూర్చోబెట్టి హారతులిచ్చి అక్షింతలువేసి ఆశీర్వదించేవారు. ఎంతబాగుండేదో చూడటానికి.

మా స్కూల్లోనూ అంతే! పుట్టినరోజు అంటే ఆ పిల్లలు కొత్తదుస్తులు వేసుకుని అపురూపంగా ఉన్నంతలోనే అందంగా, ప్రత్యేకంగా తయారయివచ్చేవాళ్ళు. క్లాసులో ఉన్న పిల్లలందరికీ తియ్యతియ్యని చాక్లెట్లు పంచేవాళ్ళు. ఆ రోజంతా ఏ టీచరూ ఆ పిల్లలని తప్పుచేసినా సరే, హోంవర్కు చెయ్యటం మర్చిపోయినా సరే ఏమీ దండించేవాళ్ళు కాదు.

ఇలా ప్రత్యేకంగా చూడబడటం నాకెంతో ఇష్టంగా ఉండేది. కానీ ఆవిధంగా ప్రత్యేకంగా చూడబడే అవకాశం నాకు ఏనాడూ రాలేదు.

ఎందుకంటే మా ఇంట్లో మాకెవ్వరికి ఎప్పుడూ పుట్టినరోజులు చేసేవాళ్ళు కాదు. కానీ నేను [illegible] ఈ పుట్టినరోజులు నన్ను మాత్రం ఎంతో ఆరాటపెట్టేవి. నాకెందుకు పుట్టినరోజులు చెయ్యరు ఆ రోజు చక్కగా తలంటు పోసి కొత్తబట్టలు ఎందుకువెయ్యరు? ఎంచక్కా స్కూలికి ఆ కొత్తబట్టలు వేసుకుని వెళ్ళి తలంటుపోసుకున్నందువలన ఎగిరే ముంగురులని వెనక్కి తోసుకుంటూ క్లాసులో తోటిపిల్లలందరికీ చాక్లెట్లు పంచిపెడితే ఎంత గొప్పగా, గర్వంగా ఉంటుందీ? పోన్లే ఏదో మధ్యతరగతి కుటుంబంమాది. ఇంత ఖర్చు మావాళ్ళు భరించలేరను కుంటే కనీసం ఆ పుట్టినరోజు ముచ్చట ఇంటివరకైనా చెయ్యొచ్చుగదా! కొత్త బట్టలు లేకపోయినా తలంటు పోసి ఉన్న బట్టల్లోనే మంచివి వెయ్యవచ్చునే. స్కూలు పిల్లలందరకూ చాక్లెట్లు పంచలేకపోయినా ఇంట్లోవరకైనా ఒక పావులీటరు పాలతో పాయసం చెయ్యవచ్చునే? కానీ మా అమ్మ ఎప్పుడూ కనీసం నా పుట్టిన రోజునయినా గుర్తుచేసేది కాదు. నేనే గుర్తువుంచుకుని చెప్పినా 'ఆఁ అవును' అనేది అంతే. అంతటితో నా పుట్టినరోజు ముచ్చట అయిపోయేది.

ఒకసారి మాత్రం, బహుశా నాకు పన్నెండేళ్ళప్పుడు అనుకుంటా. ధైర్యం చేసి మా అమ్మని అడిగాను,

'అమ్మా! నాకు పుట్టిన రోజు ఎందుకు చేయరు?' అని.

మా అమ్మ 'మనకి అచ్చిరాలేదు'. అంది అయిష్టంగా.

'అచ్చిరావటం అంటే ఏమిటి?' అని అడిగాను.

అమ్మ మాత్రం నాకేసి కోపంగా చూస్తూ, "ఎందుకే నీకీ వెధవ సమాచారం అంతా? వెధవగోల. చంపుకుతింటున్నావు. పో. పోయి ఆడుకో. లేదా చదువుకో. మనింట్లో పుట్టినరోజులు చెయ్యం. అంతే" అని కసురుకుంది.

ఏడుపు దిగమింగి లేచిపోయా! అమ్మ అలా కసరటం నాకు ఎంత దుఃఖాన్ని కలిగించిందో నాకే తెల్సు. మళ్ళీ ఎన్నడూ అమ్మని నా పుట్టినరోజు గురించి అడగనూ లేదు. గుర్తు చెయ్యనూ లేదు. అమ్మ కసుర్లు నన్ను అంతగా గాయపరిచాయి. కానీ ఏనాడూ నా పుట్టినరోజునాడు మరిచిపోయి అయినాసరే చెమ్మాబుడు పాయసం అయినా చేయని అమ్మని మనసులో మాత్రం ఏనాడూ క్షమించలేదు. పసిపిల్లల మనసులు తూట్లు పొడిచే హక్కు వీళ్ళు తల్లిగా వాళ్ళకుందనుకుంటారేమో నాకు మాత్రం తెలియదు.

కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో కూడా ఫ్రెండ్స్ ఏనాడయినా 'పుట్టినరోజు' అని సినిమాకు పిలిచినా, హోటళ్ళకు పిలిచినా నేను



సుబ్బారావు: సార్, సార్! నా జేబును ఎవరో కట్ చేశారండి.
పోలీస్: 'నాకు తెలిసినతను తక్కువ ధరకు కుడతాడు. వెళ్ళి కుట్టించుకో' అన్నాడు పరధ్యానంగా.

—సాదుల ప్రభాకర్,
కరీంనగర్.

మాత్రం వెళ్ళేదాన్ని కాదు. ఎందుకంటే వాళ్ళని ఏనాడూ 'నా పుట్టినరోజు' అంటూ అలా తీసికెళ్ళే సౌకర్యం, స్వేచ్ఛనాకు లేవు కనుక. అప్లికేషన్లలో నా పుట్టిన తేదీ చూసిన ఫ్రెండ్స్ చనువుగా పార్టీ అడుగుతున్నా ఏదో చెప్పి, నవ్వి తప్పించుకునేదాన్ని. వాళ్లు నన్ను 'పీనాసిది. పైసా ఖర్చుపెట్టదు' అని తిట్టుకుంటుంటే అప్పటికి నవ్వినా ఇంటికివెళ్ళి బాత్‌రూమ్‌లో తలుపులు వేసుకుని కరవుదీరా ఏడ్చేదాన్ని.

మొత్తానికి నా జీవితంలోనూ ఒక ప్రత్యేకంగా చూడబడే రోజు వచ్చింది. అది నా పెళ్ళి రోజు. పెళ్లి అయి మా వారి దగ్గరకు కాపురానికి వచ్చినా 'పుట్టిన రోజు' మాత్రం నన్ను 'హంట్' చేస్తూనే ఉంది. నా పెళ్ళయిన రెండు నెలలకే మావారి పుట్టినరోజు వచ్చింది. నా సరదాలన్నీ ఆయన మీద తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ రోజు చాలా కష్టపడి బోలెడు పిండివంటలు చేశాను. ఆయనకి తెలియకుండా ఆయన కోసం బట్టలు కుట్టించాను. గుడిలో ఆయనచేత ఆయన పేరిట అర్చన చేయించాను. ఆరోజు ప్రత్యేకంగా ఆయనకు తలంటుపోసి కొత్త బట్టలు ఇచ్చి హారతిచ్చి బొట్టుపెట్టాను. పుట్టినరోజు స్పెషల్ అంటూ ఆయనతో పోరి సెలవు పెట్టించాను. నేను చేసినవన్నీ ఇష్టంగా చేయించుకున్న మావారు ఆ తరువాతి నెలలో వచ్చిన నా పుట్టినరోజునాడు మాత్రం కనీసం నాకు శుభాకాంక్షలు కూడా చెప్పలేదు. ఆఫీస్‌కి పోబోతూ వెనక్కి తిరిగి, అప్పుడే గుర్తు వచ్చినట్లు

'ఇవాళ నీ పుట్టినరోజు కదూ! పోనీ ఏదన్నా స్వీట్ చేసుకో' అని ఉదారంగా అడగని వరం ఇచ్చేశారు. నా రియాక్షన్ కూడా చూడకుండా ఆఫీస్‌కి టైమవుతోందంటూ హడావిడిగా వెళ్లిపోయారు.

ఈసారి మాత్రం ఏడవటానికి నాకు బాత్‌రూమ్ అవసరం లేకపోయింది. ఇంట్లో ఎవరూ లేరుగా. చక్కగా తలుపులేసుకుని కావలసినంతసేపు ఏడిచాను. అంతసేపు ఏడ్చినా నాలో ఎక్కడో ఏదో చిన్న ఆశ. పొద్దున్న ఆఫీసు హడావిడిలో వెళ్లిపోయి ఉంటారు. సాయంత్రం తప్పకుండా నా కోసం చీరో, స్వీటో కనీసం పూలో తెస్తారని రోజంతా ఎదురుచూశా. కానీ ఆయన ఖాళీచేతులు చూసి రాబోతున్న నిట్టూర్పు నాపుకొని మౌనంగా ఉండిపోయాను. పోనీ నా పుట్టినరోజు ఏ నెలాఖరు సమయంలోనో వస్తుంది. నాకేదన్నా చిరుకానుక ఇవ్వాలన్నా ఆయన జేబులు ఖాళీ అని సర్దుకునే అవకాశం కూడా నాకులేదు. నా పుట్టినరోజు నెల మొదటివారంలోనే వస్తుంది. మావారికి ఆరకమైన సున్నిత భావాలు తెలీవని రాజీ పడ్డాను. అంతే.

మొత్తానికి నాకు పుట్టినరోజు ముచ్చట తీరకుండానే యాభై అయిదేళ్ళొచ్చాయి. ఇప్పుడిక పుట్టిన రోజుల మీద నాకు ఏ వ్యామోహమూ లేదు. అది ఎలాగూ నాకు అందని ద్రాక్షపండు. కొందరి జన్మలంతే అని సరిపెట్టుకున్నాను. నాకు ఆ ముచ్చట తీరకపోయినా పిల్లలకి మాత్రం పుట్టిన రోజులు ప్రతి ఏడూ ప్రత్యేకంగా చేసేదాన్ని. దాన్ని మాత్రం వద్దని ఆయన అనేవారు కాదు.

పిల్లలకి పుట్టిన రోజులొస్తే నానా హైరానా పడేదాన్ని. వాళ్లకి తలంట్లుపోసి కొత్త బట్టలు వేసి హారతిచ్చి దిష్టి తీసేదాన్ని. వాళ్ళ క్లాసు పిల్లలకి పంచిపెట్టమని చాక్లెట్లు కొనిచ్చేదాన్ని. సాయంత్రం పూట మా చిన్నప్పటి రోజుల్లోలాగా పేరంటాలు చేయకపోయినా పిల్లల స్నేహితుల్ని పిలిచి ఇంట్లో నేనే తయారు చేసిన కేకు కోయించేదాన్ని. పిల్లలు కూడా పుట్టిన రోజుల ప్రత్యేకత, సరదా గుర్తించి మళ్ళీ పుట్టిన రోజు కోసం మరుసటి రోజు నించే ఎదురుచూసేవారు.

మా పిల్లలకే కాదు. వాళ్ళ స్నేహితులకి పుట్టినరోజులు అయినా సరే. పిల్లలచేత ప్రత్యేకంగా పెన్నులు, పెన్సిళ్లు, చిన్నచిన్న పుస్తకాలు, బంతులు లాంటి కానుకలు ఇచ్చేదాన్ని, బంధువుల పిల్లల పుట్టిన రోజులు కూడా గుర్తు ఉంచుకుని గ్రీటింగ్స్ పంపేదాన్ని. నా సరదా చూస్తూ మావారు 'నీకీ పుట్టినరోజు పిచ్చి ఏమిటి?' అనేవారు నవ్వుతూ. ముచ్చటలను పిచ్చి అనే వాళ్ళతో ఏం సమాధానం చెప్పాలి? నవ్వి ఊరుకొనే దాన్ని.

ఇంతగా నన్ను 'పుట్టిన రోజుల పిచ్చిది' అనే మావారు కూడా తన పుట్టిన రోజుకి మాత్రం నాచేత తలంటు పోయించుకుని, నేనిచ్చిన కొత్త బట్టలు వేసుకుని, నేను చేసిన

స్వీట్లు తిని ఆఫీసుకి వెళ్ళేవారు. తాను పూల రంగడిలా అన్ని ముచ్చటలూ తీర్చుకుం టున్నా ఏనాడూ, నా పుట్టిన రోజుని పట్టించు. కోని మావారిని నేను క్షమించలేను.

నేను ఇలా పుట్టిన రోజు ముచ్చట తీరే రోజు కోసం ఎదురుచూస్తూ ఇంట్లో అందరి పుట్టిన రోజులూ చేస్తూ చేస్తూ ముసలిదాన్ని అయిపో యాను. కొడుకుల పెళ్ళిళ్ళయాయి. కోడళ్లు వచ్చారు. వాళ్ళ పుట్టిన రోజులూ నేనే గుర్తు పెట్టుకుని వాళ్ళకి నచ్చిన విధంగా చేసే దాన్ని. నా కోడళ్ళు వచ్చిన కొత్తల్లో నా పుట్టిన తేదీ గురించి అడిగినా అప్పటికే చెరువు మీద అలిగిన చందంగా నేనూ నా పుట్టిన రోజు మీద అలిగి ఉండటంతో విషయం దాటేశాను కానీ సమాధానం చెప్పలేదు. కొడళ్ళు అడిగినంత అయినా అడగలేదు నా కొడుకులు. పున్నామ నరకం నుంచి తప్పించే నా పుత్రరత్నాలు.

మా వారిది పెన్షనబుల్ జాబ్. ఫామిలీ పెన్షన్ కూడా వస్తుందట. ఆయనకి ఆ సంవత్స రం షష్టిపూర్తి. రిటైరయ్యేముందు పెన్షన్ పేపర్లు సబ్మిట్ చేయటం కోసం నా ఫోటోలు, డేటాఫ్‌బర్త్ సర్టిఫికెట్లు ఇస్తుంటే పిల్లలు చూశా రునా పుట్టిన తేదీని.

'అమ్మా! నీ పుట్టిన రోజు గురించి ఎప్పుడూ చెప్పలేదేమిటి? ఇన్నాళ్ళూ నీకు నీ డేటాఫ్ బర్త్ తెలియదనుకున్నాం' అన్నారు.


'బియ్యే చదివిన నీ తల్లికి తన పుట్టిన తేదీ తెలియదని ఎలా అనుకున్నార్రా?' అన్నాడు కినుకగా.

'అమ్మా! ఈ వారం నాన్న పుట్టిన రోజు, తిరుపతి వెళ్ళి షష్టిపూర్తి సందర్భంగా కళ్యా ణం చేయించాలనుకున్నాం కదా! రెండు నెలల్లో నీ పుట్టిన రోజు. ఈసారి నీ పుట్టిన రోజు ఘనంగా చేసే బాధ్యత మాది. ఇన్నాళ్ళూ మా పుట్టిన రోజులూ చేశావు. ఈసారి నీకు మేము చేస్తాం'' అన్నారు పిల్లలు.

"అవునవును.'' వంతపాడారు కోడళ్ళు.

మా వారు ఆ పక్కనే కూచుని చిరునవ్వులు చిందిస్తూ బుద్ధునిలా చిన్ముద్రతో, 'అరే. ఇన్నాళ్ళూ నాకా అయిడియానే రాలేదు' అన్నారు.

నాకెందుకో ఒక్కసారి జలజలా కన్నీళ్ళు రాలాయి. మరి ఆ కన్నీళ్ళే కదా నాకు ఇన్నే ళ్ళనించే పుట్టిన రోజులు జరిపిస్తున్నవి. ఇన్నాళ్ళ తర్వాత ఈసారి నా పుట్టిన రోజు వీళ్ళు చేస్తున్నారంటే ఎందుకో తెలియదు కానీ ఆనందం కన్నా దుఃఖమే ఎక్కువ వచ్చింది. ఇన్నాళ్ళూ ఈ పుట్టిన రోజులు చేసుకోకపోవటం అనే అవమానాన్ని భరించ టం వల్ల కాబోలు. లేక ఇన్నాళ్ళు ఎవరినైతే నావాళ్ళు అనుకుని సేవలందిస్తున్నానో వాళ్ళే నా ముచ్చటని, నా మనసులో బాధని




గుర్తించనందుకో నాక్కూడా తెలియదు. నా కన్నీళ్ళు అందర్నీ కదిలించినట్లున్నాయి. ఆయన నా చేతులు పట్టుకుని, 'క్షమించు. నీకు పుట్టిన రోజులంటే చాలా సరదా అని తెలిసే ఏనాడూ ఏదో నిర్లక్ష్యం వల్ల నీ పుట్టిన రోజులు చేయలేకపోయాను. నీ మనసు ఏనాడూ తెలు సుకోలేక పోయాను. నువ్వు ఇన్నేళ్ళుగా మా అందరికీ పుటిన రోజు ముచ్చట తీరుస్తుంటే నువ్విచ్చే కానుకలన్నీ తీసుకుంటూ కూడా నీ పుట్టిన రోజు గుర్తించి మర్చిపోయాం. పిల్లలు చిన్నవాళ్ళనుకున్నా, నేను మాత్రం చాలా మూర్ఖంగా, స్వార్థంగా ప్రవర్తించాను. సారీ ఈసారి మాత్రం అలా కానివ్వను. ఈసారే కాదు. ఇక నీ ప్రతి పుట్టిన రోజూ కూడా చేస్తాం' అన్నారు. ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ రోజు చాలా సంవత్సరాల తర్వాత మళ్ళీ నాకు బాత్‌రూమ్ అవసరం కలిగింది. నన్ను ఓదార్చే నా కన్నతల్లి అదే కదా మరి.

తెల్లవారితే నా పుట్టినరోజు. ఇంట్లో అందరూ ఎన్నడూలేని హడావిడి పడుతు న్నారు. నాకేసి చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతున్నారు. ఏమన్నా తెలుసుకోవాలను కున్నా 'సస్పెన్స్, సస్పెన్స్' అంటూ చెప్పనే లేదు. వాళ్ళ రహస్యాలు వాళ్ళే పంచుకు న్నారు. ఎన్నడూ లేని ఈ ఏర్పాట్లు, ఈ హడా విడికి గుండె ఏదో వింత వింతగా కొట్టుకొం టోంది.

పుట్టినరోజు అనంగానే నాకు చటుక్కున గుర్తొచ్చేది 'ఛీపో అని కసిరే మా అమ్మా', 'నీ కిష్టమయిన స్వీట్ చేసుకో' అని ఉదారత చూపించే ఆయనా, ఆమాత్రం ఉదారతా, చికాకూ కూడా కనపరచని పిల్లల నిర్లిప్తతా. ఇప్పుడు ఇన్నేళ్ళ తర్వాత నాకు పుట్టినరోజా? వింతగానూ ఉంది. ఎందుకో తెలియదు కానీ చెప్పలేనంత అవమానంగా ఉంది. ఏనాడూ లేనిది ఆ రోజు ఈ పుట్టిన రోజు అన్నమాట గుర్తు చేసుకొన్న ప్రతిసారీ గుండె 'ఠక్' 'ఠక్' అని కొట్టుకొంది.

ఆ రాత్రి నాకు కంటిమీద కునుకేలేదు. పక్కనే ఉన్న మావారు మాత్రం అలవాటుగా నా భావావేశం, ఉద్వేగం ఏమీ పట్టించుకో కుండా నిర్విచారంగా గుర్రుకొడుతూ మరీ నిద్రపోతున్నారు. రాత్రి గడియారం గంటలు లెక్క పెడుతూ పడుకున్నాను. ఒకటి, రెండు, మూడు, నాలుగయింది. తెల్లవారిన సూచనగా ఎక్కడో ఈ పట్నవాసంలో కూడా కోడికూత వినిపించింది. అంటే నా పుట్టినరోజు.

'ఛీఫో' అని అమ్మ కసిరిందీ నాడే,

'నీ కిష్టమయిన స్వీట్ చేసుకో' అని మావారు ప్రేమ ప్రకటించిందీ నాడే,

నా కడుపున పుట్టిన పిల్లలు పట్టించుకోని నా పుట్టినరోజీనాడే.

ఇన్నేళ్ళు లేని ఈ పుట్టినరోజు ప్రత్యేకత ఈసారి మాత్రం ఎందుకు? యాభై అయి దేళ్ళు వచ్చి ఈ రోజు కుర్చీలో కూర్చొని అక్షింతలేయించుకోగలనా? లేదే? పోనీ కేండిల్సు వెలిగించి ఆర్పి కేకు కోయగలనా? అదీ లేదే? ఆలోచిస్తున్న కొద్దీ గుండెల్లో నెప్పి ఎక్కువయింది. అది కూడా మామూలు నొప్పిలా లేదు. రెండు నిముషాలలోనే నాకు స్పష్టంగా తెలిసింది. అవి నా అంతిమ క్షణా లని. ఎంత విచిత్రం. పుట్టినరోజునాడే పోతాను కాబోలు.

అంతలోనే ఒక వింత శాంతి నన్ను చుట్టు ముట్టింది. అప్రయత్నంగా అంత నెప్పి, బాధ లోనూ నవ్వు వచ్చింది. ఇంక నా పుట్టినరో జులు నిరాటంకంగా జరుగుతాయి. ఘనంగా చేస్తారు. మరో యాభై ఏళ్ళదాకా నా పుట్టిన రోజులు జరుగుతూనే ఉంటాయి. పుట్టిన రోజుల ముచ్చట తీర్చుకోలేకపోయినా, పుట్టిన రోజునాడే చనిపోతున్నందువలన తద్దినాలు మాత్రం తప్పనిసరిగా ఆ రోజున జరుగు తాయి. పిండివంటలూ, స్వీట్లూ కూడా చేస్తారు. నా పటానికి పూజ చేస్తారు.

తెరలు తెరలుగా నవ్వు వస్తోంది. ఇక మావారికి గానీ, మా పిల్లలకి గానీ నా పుట్టిన రోజు మర్చిపోయే అవకాశం కానీ, తప్పించు కునే ఛాన్స్ కానీ ఉండదు. ఎందుకంటే పుట్టిన రోజుకన్నా ప్రాముఖ్యమైనది తద్దినం. బ్రతికి ఉన్నవారి పుట్టినరోజులకన్నా చచ్చినవారి తద్దినం మరిచిపోకూడనిదీ, వదలరానిదీను. నా పుట్టిన రోజుల ముచ్చట ఇక తీరుతుంది. గుండెనెప్పి బాధిస్తున్నా నవ్వు వస్తూనే ఉంది. ఒక చేతో గుండెని అదిమి పట్టుకుని మరో చెయ్యి నోటికడ్డంగా పెట్టుకొని నవ్వు తూనే ఉన్నాను. గుండెనెప్పి పెరిగింది. నాలోంచి ఏదో జీవశక్తి లేచి గాలిలోకి ఎగిరింది.